కథ

# విలువలు

—కోరం రాజబాబు

నీరెండ రోడ్డంతా పరుచుకుంది. నేను మౌనంగా నడుస్తున్నాను. గమ్యం తెలియని ఆలోచనలు నావి. సిటీకొచ్చి రెండు నెల్లయ్యింది. ప్రతి రోజూ ఏదో ఒక వీధి. అలా తిరగడం అలవాటయ్యింది నాకు. నిజానికి నేను అలవాటు చేసుకోలేదు. నా అవసరం నన్నలా తయారు చేసింది.

ముందుకు నడుస్తున్న నన్ను ఓ సెంటర్ ప్రక్కనే వున్న ఖాళీ స్థలంలో జనం గుమికూడి వుండటం ఆకర్షించింది. ఆలోచించకుండా అటువైపు నడిచాను. జనం రింగ్‌లా నిల్చున్నారు. ఏదో తమాషా సన్నివేశం అనుకున్నాను. జనాన్ని నెమ్మదిగా తప్పించుకుంటూ ముందుకొచ్చాను. ఆశ్చర్యం! కాసేపు ఆలోచనలు స్తంభించి పోయాయి. ఆ తర్వాత గుండెలో చివుక్కుమంది. మళ్ళీ ఆలోచనలు చాప చుట్టేశాయి.

జనం బాగా పెరిగిపోయారు. రింగ్ పెద్దదయ్యింది. నెమ్మదిగా నా స్థానం మారి వెనక్కి వచ్చేశాను. ఎంత అభినయం! ఎంత చాతుర్యం! నిండా పన్నెండేళ్ళు కూడా లేని కుర్రాడు అచ్చంగా గాంధీజీ వేషంలో ఆవేశంగా ఏవేవో అంటున్నాడు. అది ఏక పాత్రాభినయం అనుకుంటా. నేనొకసారి రవీంద్రభారతిలో చూశాను. నిజమే! సందేహం లేదు. ఆ కుర్రాడు చేస్తున్నది ఏకపాత్రాభినయమే. ఎంత గొప్పగా నటిస్తున్నాడో! ఏమాత్రం బిడియం, బెరుకూ లేని ఆ కుర్రాణ్ణి చూసి అందరూ చప్పట్లు కొడుతుంటే నాకాశ్చర్యం వేసింది. వేయదా మరి! మన విలువలు అంత పతనమైపోయాయా? నేనలా ఆలోచిస్తుండగానే ఆ కుర్రాడు ఏకపాత్రాభినయం ఆపేశాడు. చుట్టూ వున్న జనం కదల్లేదు. అందర్నీ ఓసారి పరికించి చూశాడు. నేను తల పైకెత్తి ఆ కుర్రాడినే చూస్తున్నాను. అంతలో ఒకతనెవరో ముందుకెళ్ళి అతడికి షేక్ హ్యాండిచ్చి చేతిలో పది రూపాయలు పెట్టాడు. అలా మరొకరు..మరొకరు.. ఆ కుర్రాడిలో ఉత్సాహం పెరిగిపోయింది. కర్రను ఠీవిగా పట్టుకుని పాట అందుకున్నాడు. పెద్దగా గొంతెత్తి పాడుతున్నాడు. నాకు రైల్లో ప్రయాణం గుర్తొచ్చింది. రైలు నడుస్తున్నప్పుడు గుడ్డి వాళ్ళు పాటలు పాడుతూ డబ్బులు అడుక్కుంటారు. వాళ్ళెంత గట్టిగా పాడతా



రంటే రైలు బోగీ మొత్తం ఆ పాటే వినిపిస్తుంది. అంతకన్నా గట్టిగా పాట అందుకున్నాడు ఈ కుర్రాడు. ఆవేశంగా కూడా పాడుతున్నాడు. 'ఎన్ని వేషాలు కట్టిన అనుభవమో!' మనసులో అనుకున్నాను. జనం వస్తున్నారు. కొంతమంది వెడుతున్నారు. నేను మాత్రం ఓ మూలన వున్న చిన్న సిమెంట్ అరుగు ఎక్కి అతన్నే గమనిస్తున్నాను.

పాట పూర్తయ్యింది.


చేతిలో వున్న కర్ర కింద పెట్టి అందరికీ ఓసారి దణ్ణం పెట్టాడు. అచ్చం గారడీ వాడు చేసినట్టుగా..ఆ తర్వాత చేయి చాపి రింగ్ చుట్టూ తిరిగాడు. జనం అప్పటికే పల్చబడ్డారు. చాలా మంది ఆ వినోదం చూసి వెళ్ళిపోయిన వాళ్ళే. అయినా డబ్బులు బాగానే ముట్టాయి. ఆ డబ్బులన్నింటినీ చిన్న మూట కట్టాడు. ఆ తర్వాత తనకేమీ పట్టనట్టు నడుచుకుంటూ వెళ్ళిపోయాడు.

ఆ కుర్రాడి గురించే తీవ్రంగా ఆలోచిస్తున్న నేను, ఆ ప్రదర్శన తిలకించిన ఇద్దరు విదేశీ మహిళల వైపు అనుకోకుండా చూశాను. ప్రదర్శన ముగిసే వరకూ వాళ్ళిద్దరూ అక్కడే వున్నట్టు వాళ్ళ మాటలను బట్టి నాకర్థమవుతోంది. "ఇంత గొప్ప నాయకుణ్ణి ఈ దేశంలో ఇలాగే చూస్తారా? ఇదంతా ఆ మహానుభావుణ్ణి అవమానించినట్టే కదా!" ఒకామె అంది. "నిజమే! గాంధీజీ ఇంత గొప్పవాడని మనదేశంలో కూడా చెప్పుకుంటారు. చాలా ఘోరం. ఈ దేశంలో వాళ్ళకు దేశభక్తి లేదు" అంది రెండో ఆవిడ.

కాదు...గాంధీజీ అంటే ప్రాణం. ఈ స్వేచ్ఛ మాకు ఆయనిచ్చిందే అని గట్టిగా వాళ్ళ ముందు అరవాలనుకున్నాను. కాని అలా చేయలేకపోయాను. నాకు తెలుసు! ఆ కుర్రాడు మరో సెంటర్లో వేషం కడతాడని. అందరిలా ఆ కుర్రాడి ప్రదర్శన నేనూ చూశాను. నేనెందుకు ఆ ప్రదర్శనను ఆపలేక పోయాను? నాలో ఆవేశం కొద్దిగా తగ్గింది. తిరిగి ఆలోచనలు నన్ను చుట్టుముట్టాయి.

గాడ్సే ప్రదర్శనను చూసి రగిలిపోయిన మన హృదయాలు బాపూజీ వేషం కట్టి రోడ్డుమీద డబ్బులు అడుక్కుంటుంటే ఎందుకు ఆవేశం ప్రదర్శించలేవు? ఈ దుస్థితి పట్ల ఎందుకు స్పందించలేవు?

అడుక్కోవడాన్ని ప్రోత్సహించ కూడదు. వారికి ఉపాధి చూపించాలి. పోస్టు గ్రాడ్యుయేషన్ చదువుతున్న రోజుల్లో నేను నేర్చుకున్న




పాఠం అది. ఎంత మందికి చూపించాలి? సమాధానం దొరకని ప్రశ్న. ఏ వీధి చూసినా, ఏ ఫుట్‌పాత్ చూసినా, రైళ్ళు, బస్సులు... చివరకు సిగ్నల్ లైట్ల దగ్గరా డబ్బుల కోసం చేయి చాచేవాళ్ళు మనకు కనిపిస్తూనే వుంటారు. వాళ్ళందర్నీ ఏం చేయాలి? వేలు...లక్షలు...అలా పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చే ముష్టివాళ్ళు...నాలో ఆవేశం మరికాస్త తగ్గింది. ఈ అవతారాలన్నీ ఆకలి తీర్చుకోవడం కోసమే కదా! పైగా మనది స్వేచ్ఛా భారతం! ఏ వేషమైనా, ఎవరైనా వేయొచ్చు! వద్దని చెప్పే అధికారం నాకెక్కడిది? సంస్కరించడం చేతకానప్పుడు సలహాలివ్వడం ఎందుకు? నీకు వచ్చినట్టు నువ్వు బ్రతుకు. నీవాళ్ళను బ్రతికించుకోలేక పోయినా నువ్వైనా బ్రతుకుతావు అని చెప్పే నా మిత్రుడు గుర్తొచ్చాడు ఆ క్షణంలో.

నిజానికి నేనో నిరుద్యోగిని. నేను చేస్తున్న పనేమిటి? పెద్ద చదువులు చదివాను. 'పట్నంలో వుంటున్నాడు కాబట్టి ఏదో గవర్నమెంట్ ఉద్యోగం చేస్తున్నాడు నా కొడుకు..'అని అమ్మ చెప్పుకునేలా నమ్మించింది నేను. వాస్తవానికి నేను చేస్తున్నదేమిటి? హోటల్లో బిల్లులు రాస్తూ రోజులు గడుపుతున్న నేను తల్లిని మోసం చేస్తున్నాను. నా మనస్సాక్షిని మోసం చేస్తున్నాను.

నాలాంటి చదువుకున్న వాడికి దొరకని దారి ఆ కుర్రాడికెక్కడ దొరుకుతుంది? హోటళ్ళలో ప్లేట్లు కడిగే వయసు వాడిది. ఇలా ఎందుకంటున్నానంటే ప్లేట్లు కడిగే వారంతా ఆ వయసు వారే కాబట్టి. నిజం చెప్పుకోవాలంటే ఆ వయసు కుర్రాడికి విషయ పరిజ్ఞానం ఎంత వుంటుంది? నాలుగు డబ్బులు సంపాదించుకుని కడుపు నింపుకోవడం తప్ప చేస్తున్న పని విలువలేమిటి? అన్న ఆలోచన వాళ్ళకెందుకుంటుంది? ఏమాట కామాటే చెప్పుకుంటే ఈ సమాజంలో ప్రతి వ్యక్తీ నటిస్తాడు. పైకి సంస్కారం పుట్టిపడినా, అంతరంగం నటిస్తూనే వుంటుంది. అలాంటప్పుడు ఆ కుర్రాణ్ణే ఎలా తప్పు పట్టడం?

ఇప్పుడు నాకూ, ఆ కుర్రాడికి తేడా ఏముంది? నేనూ నటిస్తున్నాను. ఆ కుర్రాడూ నటిస్తున్నాడు. ఇద్దరి లక్ష్యం ఒక్కటే. అయితే..ఎంచుకున్న మార్గాలే వేరు.

అలా మధనపడి, వేదన అనుభవించి వాస్తవం గ్రహించిన నా మనసు ప్రశాంతంగా మారింది. ఎప్పుడూ చేరే సమయానికన్నా కొంచెం ఆలస్యంగా ఇంటికి చేరాను. ఇల్లు అంటున్నానని అదేదో మంచి ఇల్లనుకోకండి. ఒకే ఒక్క గది. పైగా దానికి కిటికీలు లేవు. నిరుద్యోగిని కదా! నాకున్న తోడు ఆ గది ఒక్కటే!

కటిక నేలపై ఒక చాప పర్చుకుని నిద్రపోవడం అలవాటు చేసుకున్నాక ఆ అలవాటే బాగున్నట్టనిపించింది. అందులోనే సుఖం వెతుక్కుంటూ నెమ్మదిగా నేను వాల్చాను.

ఆ కుర్రాడు గుర్తొచ్చాడు. నిజానికి మర్చిపోతే కదా! అంటే తిరిగి నా కళ్ళల్లో మెదిలాడన్న మాట! చిన్నగా నవ్వుకున్నాను. ఆకలి కడుపుకి విశ్రాంతి దొరకదని తెలుసు. నాకే గది వుంది. ఆ కుర్రాడికి...ఈ సిటీలో చోటంతా వాడే కదా!

నెమ్మదిగా కళ్ళు మూసుకున్నాను. ఆ కుర్రాడంటే నాకిప్పుడు ఏ కోపమూ లేదు.